ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రతి నాయకుడు, కార్యకర్త బీఆర్‌ఎస్ పార్టీలో కష్టపడి పనిచేస్తూ.. పార్టీని మరింత బలపరచాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం కార్పొరేషన్ అధ్యక్షులు అంతారం నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి పార్టీ బలోపేతానికి తీసుకోబోయే చర్యలు, పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర ప్రజలను పట్టించుకోరని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఊకదంపుడు మాటలు చెప్పి, ఆరునెలలైనా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా తాను ఉంటానని, మోసం చేసిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు నవాజ్‌ముంతాజ్, మాజీ మేయర్ మహేందర్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, చేవెళ్ల యాదిరెడ్డి, మల్లేష్ యాదవ్, సుమన్‌గౌడ్, సుందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రోగామ్ అడ్వైజరీ కమిటీ సమావేశం



ఐసీఎం కార్యాలయం

రాజేంద్రనగర్: 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఉన్న సహకార సంస్థల్లో మానవ వనరుల అభివృద్ధికి అవసరమైన అవగాహన, శిక్షణ కార్యక్రమాలను గుర్తించి వాటిని అమలు చేసేందుకు సంస్థల వారీగా ప్రణాళికలు రూపొందించడానికి ఐసీఎంలో ప్రోగ్రామ్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఈనెల 31న నిర్వహించనున్నట్లు స్టేట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి.శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత (ఐఏఎస్) అధ్యక్షత వహిస్తారన్నారు. వివిధ సహకార శాఖల అధిపతులు, సిబ్బంది పాల్గొంటారని సమాచారం.

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ‘ఆర్’ ఫ్యాక్టర్

శంషాబాద్ : జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో ‘ఆర్’ ఫ్యాక్టర్ కారణంగా చేవెళ్ల నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం సునాయసంగా జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు ఫసియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ రాజకీయాల్లో రాహుల్‌గాంధీ, రాష్ట్ర రాజకీయాల్లో రేవంత్‌రెడ్డిల సహకారంతో రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

చిన్నారుల అదృశ్యం కలకలం..

రెండు గంటల్లో ఆచూకీ లభ్యం

శంషాబాద్: ఇద్దరు చిన్నారులు అదృశ్యం పట్టణంలో కలకలం రేపింది. మాటలు రాని సుమారు నాలుగేళ్ల లోపు ఉన్న ఇద్దరు బాలలు గురువారం ఉదయం పట్టణంలోని బృందావన్ టౌన్‌షిప్‌లోని తమ ఇంటి నుంచి బయటికి వెళ్లారు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే వారిని వెతకడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో సైతం పిల్లల ఫొటోలు పెట్టి వెతికారు. మొదట కిడ్నాపర్లు ఎత్తుకెళ్లి ఉండొచ్చని అనుమానించారు. రెండు గంటల తర్వాత వారు హైవే సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా.. బాలలిద్దరూ నడుచుకుంటూ అక్కడికి వెళ్లినట్లు గుర్తించారు. చిన్నారుల ఆచూకీ లభించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

శంషాబాద్ : క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు రఘునందన్ అన్నారు. పట్టణంలోని కొత్వాల్‌గూడ నవోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత నెలరోజులుగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో నిర్వహించిన వేసవి శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ సమానంగా పాల్గొనాలని సూచించారు. నవోదయ యూత్ క్లబ్ అధ్యక్షుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) కార్యదర్శి డేవిడ్, కోశాధికారి ఆనందం, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు లింగంయాదవ్, నర్సింగ్‌రావు, నీరటి నర్సింహ, ప్రవీణ్‌యాదవ్, రాజేష్, ఈశ్వర్, అంజయ్య, రాజురెడ్డి, రాంచంద్ర, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పని చేయని అధికారులపై ఫిర్యాదులు చేస్తాం

- కోడ్‌ను సాకుగా చూపి అధికారులు తప్పించుకుంటున్నారు
- ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: పని చేయని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారంగా టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు నాయకులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుంచి తనకు నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తాను ప్రజలను కలవడం, బస్తీలలో పర్యటించడం లాంటివి చేయడం లేదన్నారు. దీనిని సాకుగా తీసుకొని అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. వీధి లైట్లు వెలగడం లేదని, నల్లాల్లో మురికి నీరు వస్తుందని తనకు నిత్యం ఫోన్‌లో ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. సమస్యలను పరిష్కరించాలంటూ తాను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్నానని అయితే అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు. కార్వాన్, లంగర్‌హౌజ్, టోలిచౌకీ తదితర డివిజన్‌లలో ఒక హైమాస్క్ లైట్లు కూడా వెలగడం లేదని బల్దియా వీధిలైట్ల విభాగం వారు నిద్రమత్తులో ఉన్నారా అనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మజ్లిస్‌కు చెందిన డివిజన్, ఏరియా కమిటీ సభ్యులు తమతమ ప్రాంతాల్లోని సమస్యలను తనకు లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆయన కోరారు. సమస్యల చిట్టాతో తాను బల్దియా జలమండలి, విద్యుత్ శాఖ అధికారులను కలిసి వారిని సమస్యలపై నిలదీస్తానని ఆయన స్పష్టం చేశారు. రోడ్లు అధ్వానంగా తయారైయ్యాయని ఎన్నికల కోడ్ అమలుకు ముందు ప్రారంభమైన పనులకు ఎన్నికల కోడ్ అడ్డంకి కానేకాదని అయితే అధికారులు మాత్రం పనులు నిలిపివేశారన్నారు. తాగునీటి సరఫరా సవ్యంగా జరగడం లేదన్న విషయంపై కూడా తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే తాను కార్వాన్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి సమస్యలను తెలుసుకోని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, జుబేర్ బిన్ అవద్, వజీఉజ్‌జమా సిద్దిఖి తదితరులున్నారు.



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ఎదురీత

‘బండ్లు ఓడలవుతాయి... ఓడలు బండ్లవుతాయనే’ సామెత అక్షరాల రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాల్లో అమలవుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జీహెచ్‌ఎంసీ పరిధి పక్కన పెడితే నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల్లో పూర్తి స్థాయి అధికారం దక్కించుకుని తిరుగులేని పార్టీగా దశాబ్దకాలంగా ఉంది. మణికొండలో అధికారం లేక పోయినా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు సానుకూలంగా మసులుకునే పాలకకమిటీ ఉండటంతో ఏ ఇబ్బంది రాలేదు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించకుండా పోయింది.



నార్సింగి మున్సిపల్ కార్యాలయం



- బండ్లగూడలో కాంగ్రెస్ కోట నిర్మాణం
- నార్సింగిలో కూలిన బీఆర్‌ఎస్ కోట

మణికొండ: రాష్ట్రంలో అధికారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీకి మారటంతో నియోజవర్గంలో బీఆర్‌ఎస్ కోటలకు బీటలు పారి కాంగ్రెస్ కోటలు నిర్మాణమవుతున్నాయి. అప్పటి వరకు బీఆర్‌ఎస్ కంచు కోటలుగా ఉన్న మున్సిపాలిటీలు ఒక్కసారిగా ప్లేటు మార్చి కాంగ్రెస్ వశం అవుతుండటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురౌతున్నారు. మొదటగా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెజార్టీ స్థాయిలో 16 మంది కార్పొరేటర్లు పార్టీ మారటంతో బీఆర్‌ఎస్‌కు అప్పటి వరకు ఉన్న బలం కాంగ్రెస్ పక్షానికి మారింది. దీంతో మేయర్ పీఠం సైతం ఇటీవల కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ మద్దతుతో చైర్మన్ పదవిని దక్కించుకున్న కాంగ్రెస్ ఇటీవల అవిశ్వాసం పెట్టినా ప్రతిపక్షాలకు సరైన బలం లేకపోవడంతో వీగిపోయింది.

నార్సింగిలో నేడు అధికార మార్పు...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల సమయంలో 8 మంది సభ్యులు ఉండగా అనంతరం ఇద్దరు పార్టీలు మారటంతో 6కు పడిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో ఏకంగా సభ్యులు సంఖ్య 12కు పెరిగింది. మరో ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు సైతం వారికి మద్దతుగా నిలవటంతో ఏకంగా 18 మంది 14 మంది బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టి ఇటీవల వారిని పదవీచ్యుతులను చేశారు. శుక్రవారం జరిగే ప్రత్యేక సమావేశంలో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుని ఇక్కడా కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తున్నారు.

కాంగ్రెస్ కోటకు పునాది..

బీఆర్‌ఎస్ కోట కూలి కాంగ్రెస్ కోట నిర్మాణానికి పునాదులు పడనున్నాయి. ఇక మిగిలిన శంషాబాద్ మున్సిపాలిటీలోనూ ఇప్పటికే 6 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన మరికొంత మందిని చేర్చుకుని జూన్ నెలాఖరు లోపు కాంగ్రెస్ జెండా ఎగురవేసే దిశగా అడుగులు పడుతున్నాయనే సమాచారం. అదే తరహాలో శంషాబాద్ మండలంలోని మెజార్టీ మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలను కాంగ్రెస్‌లో చేర్చుకునేలా ఎత్తుగడలు వేస్తున్నారు.

ఏంపీ గ్రూపు ఖాళీ...

నియోజకవర్గంలో గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి గ్రూపులుగా పార్టీ నిర్మాణం ఉండేది. ఎంపీ ఎన్నికల సమయంలో ఆయన పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరటంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న వారంతా ఆయన వెంటే కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన గెలుపుకోసం పనిచేశారు. కొందరు పార్టీ మారకపోయినా గెలుపుకోసం కృషి చేశారని వినికిడి.

ఎమ్మెల్యే వర్గమే..

ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న వారు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వర్గంగా నిలుస్తున్నారు. వారిలోనూ కొందరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రభుత్వ పెద్దలకు టచ్‌లోకి వెళ్తున్నారు. ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చాక మరింత మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలోని కేశవ్‌నగర్, కృష్ణనగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు, అత్తాపూర్ పరిధిలోని ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ విలేజ్, గాంధీ విగ్రహం, కంటారెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్ ఫోర్ట్ ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, హైదర్‌గూడ పరిధిలోని నలందనగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్ కాలనీ, సిరిమల్లె నగర్, లోటస్ స్కూల్, ప్లెజెంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మణికొండ: మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 1130 గంటల వరకు జనచైతన్య కాలనీ, పంచవటీ కాలనీ రోడ్డు నెంబర్ 17 నుంచి 31 వరకు, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పంచవటీ కాలనీ రోడ్డు నెంబర్ 1 నుంచి 17వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమాన్‌నగర్, శివపురి కాలనీ, మర్రిచెట్టు నుంచి పంచవటి కాలనీ వరకు మెయిన్‌రోడ్డుతో పాటు ప్లెజెంట్ వ్యాలీ, శ్రీనివాసనగర్, శ్రీలక్ష్మీనగర్ కాలనీలో ఉండదని ఆయన పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

శంషాబాద్ : మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు నేడే ఆఖరు తేదీ అని పాలామాకుల్‌లోని మోడల్ స్కూల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. దీనికోసం పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మోడల్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధన ఉంటుందని వివరించారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

నేడు ఇందిరాపార్కు వద్ద ధర్నా

రాజేంద్రనగర్: ఫోన్‌ట్యాప్ ఘటనని వ్యతిరేకిస్తూ.. ఈనెల 31న ఉదయం 10 గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రతి డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉప కమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి : మధుబన్‌కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం తప్పనిసరిగా ఉంటుందని రాజేంద్రనగర్ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీపీ కుమార్, వెల్ఫేర్ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి సామల సతీష్, విజయ్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఎండీఏ లేఅవుట్‌తో ఉన్న మధుబన్‌కాలనీలో పార్కు స్థలాలు ఉన్నా.. ఒక్క పార్కు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదని కమిషనర్‌కు వివరించారు. కాలనీలో చెత్త, మట్టికుప్పలు ఇష్టానుసారంగా వేస్తున్నారని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఉపకమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ.. మధుబన్‌కాలనీలో పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం జరిగిన తర్వాత అహ్లాదకరంగా పార్కును ఏర్పాటు చేసి పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు.

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి



సురవరం కుమారుడు కృష్ణవర్ధన్‌ను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగుభాష చైతన సమితి, గోల్కొండ కళా సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠంల ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి రచనలు ఎంతో ప్రభావితం చేశాయని గుర్తుచేశారు. అనంతరం సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజిని దేవి, గోల్కొండ కళా సాహితీ కళాసమితి అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, తెలుగు భాషా చైనత్య సమితి అధ్యక్షులు బడేసాబ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే దైవానుగ్రహం



బహుమతి ప్రదానం చేస్తున్న సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: ఆధ్యాత్మిక చింతనతోనే దైవానుగ్రహం కలుగుతుందని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు, మదర్సా రహమతుల్ హులూమ్ వ్యవస్థాపకులు ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. గురువారం గోల్కొండ రిసాల బజార్‌లోని మదర్సా రహమతుల్ హులూమ్‌లో ఖురాన్ గ్రంథాన్ని కంఠస్తం చేసిన వారికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మదర్సా బాలురకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖురాన్ గ్రంథ పఠనం చేసిన వారు విజయ బాటలో పయనిస్తారని పరమాత్ముడి అండదండలతో వారు తమ జీవితంలో విజయాలు సాధిస్తారని ఆయన అన్నారు. కురాన్ గ్రంథంలో నైతిక విలువలే కాకుండా శాస్త్ర, సాంకేతిక విషయాలు ఎన్నో ఉన్నాయని ప్రళయం జరిగే రోజు ఏం జరుగుతుందో అన్న విషయాలు కూడా ఖురాన్‌లో స్పష్టంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించడమే కాకుండా వారిని తమకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మదర్సాలలో చదివే విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదుగుతారని ఆయన అన్నారు. ఇటువంటి వారు దేశ సేవలో ఎప్పుడు ముందుంటారని ఆయన అన్నారు.

బాలరాముడిని దర్శించుకున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు



అయోధ్యలో డీ.కె. అరుణతో బీజేపీ స్థానిక నేతలు

రాజేంద్రనగర్ : అయోధ్యలోని బాలరాముడిని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే అరుణతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బొక్క బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే.అరుణతో కలిసి బాలరాముడిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించాలి

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వినతి



యంపల్లి ప్రశాంత్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జర్నలిస్టులను ప్రభుత్వం ఇప్పుడైనా గుర్తించాలని రంగారెడ్డి జిల్లా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు యంపల్లి ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన జర్నలిస్టులను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గుర్తించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఉద్యమాలను ప్రపంచ నలుమూలలకు తెలిసేలా చేసింది జర్నలిస్టులు మాత్రమేనన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, వ్యాపారస్తులు, కవులు, కళాకారులు, రచయితలు ఇలా ఎన్నో సబ్బండ వర్గాల వారు చేసిన ఉద్యమాలను చూసి నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించడం.. దాని వెనుక ముమ్మాటికి జర్నలిస్టుల పాత్ర ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జర్నలిస్టు సంఘాల వారు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యమాల్లో పాల్గొని రాష్ట్రం సిద్ధించడానికి ప్రధాన కారకులైన విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వాలు మర్చిపోవద్దని కోరారు.

చెరువులు కబ్జా చేస్తే కఠిన చర్యలు



కొత్త చెరువులో పోసిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం

బండ్లగూడ: చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గంధంగూడ గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 66లోని కొత్త చెరువులో 4.13 ఎకరాల చెరువు కబ్జాకు గురౌతుందన్న సమాచారంతో తహసీల్దార్, ఆర్‌ఐ విక్రమ్‌రెడ్డి, సురేష్‌లతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ మేరకు చెరువులో పోసిన మట్టిని తొలగించారు. చెరువులను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

‘మనూ’ ఐటీఐలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

- దరఖాస్తుల సమర్పణకు జూన్ 7 చివరి తేదీ
- ‘మనూ’ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐటీఐ కోర్సులో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు ‘మనూ’ ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఈ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉర్దూ భాష లేదా ఉర్దూ మాధ్యమం ద్వారా ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనింగ్, ప్లంబింగ్ వంటి అయిదు ట్రేడ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం 040–23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు. ఇదిలావుండగా బెంగళూరు ఐటీఐలో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 3గా నిర్ణయించామన్నారు. బెంగళూరు ఐటీఐ వివరాల కోసం 080–29742261లో సంప్రదించాలన్నారు.

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌కు నివాళి



చార్మినార్: ప్రముఖ క్లాసికల్ సంగీత విద్యాంసుడు బిస్మిల్లా ఖాన్ సంగీత ప్రపంచానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. వారణాసికి చెందిన ప్రముఖ హిందుస్థానీ క్లాసికల్ సంగీత విద్వాంసుడు, భారత రత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ ఇంటికి ఈటల రాజేందర్‌తోపాటు బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరుల బృందం గురువారం వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బిస్మిల్లా ఖాన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం ముగింపు అనంతరం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించినట్లు వారు తెలిపారు.

చార్మినార్ చిహ్నాన్ని తొలగించడం సరికాదు



కార్యక్రమంలో పాల్గొన్న ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ అనగానే హైదరాబాద్‌లోని చార్మినార్ గుర్తొస్తాయని అలాంటి తెలంగాణ రాజముద్రలో చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలని నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చార్మినార్ వద్ద నిర్వహించిన కేటీఆర్ సమావేశంలో ఆయన భారీ ఎత్తున కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించడమంటే ప్రతీ హైదరాబాదీని అవమానపరిచినట్లేనన్నారు. ప్రతి ఒక్కరిని అగౌరవపరచడమేనని విమర్శించారు. తెలంగాణ వారసత్వ సంపద, సంస్కృతికి గుర్తులుగా ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు.